**పసుపు రైతుల పరిస్థితి** దయనీయంగా తయారైంది. తొమ్మిది నెలలు కష్టపడి పండించిన పంటపై దుంపకుళ్లు దాడి చేసింది. కొమ్ము సాగే క్రమంలో తెగులు సోకడం కారణంగా దిగుబడి అమాంతం పడిపోయింది. ఇక మార్కెట్‌కు వస్తే గిట్టుబాటు ధర కరువైంది. దీంతో పసుపు రైతాంగం ఆందోళన చెందుతున్నది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వారం రోజుల నుంచి పసుపు రాక ప్రారంభం కాగా, ధర అంతంత మాత్రమే పలుకుతున్నది. ఓ వైపు ఉత్పత్తి తగ్గి, ఖర్చులు పెరిగి ఎనలేని భారం మోస్తున్న అన్నదాతలకు ప్రస్తుతం పలుకుతున్న ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పసుపుబోర్డు ఏర్పాటు చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న నేతలెవ్వరూ పసుపు రైతుల వైపు కన్నెత్తి చూడడం లేదు. నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి పసుపు రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు వస్తున్నారు. కానీ ఆశించిన స్థాయిలో రేట్లు లేక ఉసూరుమంటున్నారు. గిట్టుబాటు ధర కోసం నిరీక్షణ చేయలేక మధ్యవర్తులు ఇచ్చే ధరకే పంటను అమ్ముకుని తిరుగుముఖం పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. సంక్రాంతి రోజున హడావుడిగా పసుపుబోర్డు ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించి, గంటల వ్యవధిలోనే ప్రైవేట్ హోటల్‌లో ప్రారంభోత్సవం చేసిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇప్పుడు పత్తా లేకుండా పోయాడు. నిజామాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేశామంటున్న పసుపుబోర్డు, ఆ సంస్థ చైర్మన్ పల్లె గంగారెడ్డి సైతం ఇంత వరకూ పసుపు రైతుల దుస్థితిపై నోరు విప్పలేదు. మద్దతు ధర అంశంపై మాట్లాడనే లేదు.

నిజామాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



# దుంపకుళ్లు.. ఆశలపై నీళ్లు

**పడిపోయిన పసుపు దిగుబడి**




ధాత్రికటౌన్‌షిప్ శివారులో అర్ధరాత్రి వేళ టిప్పర్‌లో తరలిస్తున్న మొరం

# దర్జాగా మొరం దందా

**రూరల్ మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు**

- రోజురోజుకూ మాయమవుతున్న గుట్టలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమ రవాణా
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు

సారంగాపూర్, ఫిబ్రవరి 2: రూరల్ మండలంలో కొందరు అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం దందా కొనసాగిస్తూ గుట్టలను మాయం చేస్తున్నారు. వీరి ధన దాహానికి గుట్టలు మాయమై మైదానాలుగా మారుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో రాత్రివేళ తవ్వకాలు చేపడుతూ మొరం దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా మార్చుకుంటున్నారు. రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ), మల్లారం ధాత్రికటౌన్ షిప్, గుండారం, సారంగాపూర్, శాస్త్రీనగర్ శివారు ప్రాంతాల నుంచి కొన్ని నెలల క్రితం మధ్యాహ్నం వేళ అక్రమంగా మొరం తరలించడంతో గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అక్రమ రవాణాపై కలెక్టర్, మైనింగ్ ఏడీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. పలు పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడల్లా మరుసటి రోజు నుంచి మొరం తవ్వకాలను నిలిపివేసేవారు. తర్వాత కొన్నిరోజులకు యథేచ్ఛగా అక్రమంగా మొరం రవాణా చేపట్టడం పరిపాటిగా మారింది.



మల్కాపూర్ శివారులో గుట్టపై మొరం తవ్వకాలకు చేపట్టడంతో ఏర్పడిన గుంతలు

### అర్ధరాత్రి వేళ తవ్వకాలు..

కొన్ని నెలల నుంచి అక్రమార్కులు మొరం తరలించే ప్రక్రియ పంథాను మార్చుకున్నారు. పగటి వేళ కాకుండా అర్ధరాత్రి వేళ మాత్రమే తవ్వకాలు చేపడుతున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జాము 5 గంటల వరకు జేసీబీ సహాయంతో టిప్పర్లలో మొరం జోరుగా రవాణా చేస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులను మచ్చిక చేసుకుని అడ్డూ అదుపు లేకుండా మొరం దందా చేస్తున్నారు. మొరం అక్రమ రవాణాపై సంబంధిత శాఖల అధికారులు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాపూర్(ఏ) గ్రామ శివారులో పెద్ద మొత్తంలో మొరం తవ్వకాలు చేపట్టి అక్రమంగా రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు కొన్ని రోజుల పాటు రాత్రి 12 గంటల వరకు గస్తీ ఏర్పాటు చేసి అక్రమ రవాణాను నిలువరించారు. కానీ 12.30 గంటల నుంచి తెల్లవారు జాము 5 గంటల వరకు వాహనాల్లో మొరం తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. మల్లారం గ్రామశివారులో ఉన్న ధాత్రిక టౌన్‌షిప్ శివారు నుంచి కూడా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుండారం, సారంగాపూర్, మహ్మద్‌నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్లను వీడీసీ సభ్యులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. మొరం తవ్వకాలు నిలిపివేయకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడంతో మొరం దందాకు బ్రేక్ పడిందని గ్రామస్తులు తెలిపారు.

### మల్కాపూర్(ఏ) శివారులో ఆగని మొరం తవ్వకాలు

మల్కాపూర్(ఏ) గ్రామశివారులో మొరం తవ్వకాలను 45 రోజుల క్రితం వీడీసీ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో కొన్ని రోజుల పాటు మొరం దందా నిలిచిపోయింది. అదే గ్రామానికి చెందిన కొందరు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి తమ గోడును వినిపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎమ్మెల్యే నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారు జామున 5 గంటల వరకు అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతూ తరలిస్తున్నారు. దీంతో వీడీసీ సభ్యులు మొరం దందాను ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 'మీ ఊరు గుట్టంతా ఇప్పుడే అరిగిపోతుందా.. అవసరానికి మొరం తీసుకెళ్తున్నారు. తీసుకెళ్లనివ్వండి' అని ఖరాఖండిగా చెప్పడంతో చేసేదేమీలేక వీడీసీ భ్యులు మిన్నకుండిపోయినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మొరం అక్రమ రవాణాను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### అక్రమ రవాణాపై ఎమ్మెల్యే మౌనం!

అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మొరం తవ్వకాల విషయంలో బీఆర్‌ఎస్ నాయకులపై ఆరోపణలు చేశారు. గ్రామాల్లో ఉన్న గుట్టలను మాయం చేస్తున్నారని, తాను గెలిస్తే మొరం అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులే వ్యాపారులుగా అవతారమెత్తి అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతుంటే ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కనిపించడంలేదా అని మల్కాపూర్(ఏ), మల్లారం గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తానని ఎమ్మెల్యే చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. ఎమ్మెల్యే అండదండలతోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరం దందా వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

**ఎకరాకు 15-20 క్వింటాళ్లే దిగుబడి..**
**ఆందోళనలో జిల్లా రైతాంగం**
**మార్కెట్‌కు వస్తున్న పసుపు ఉత్పత్తులు**
**అంతంత మాత్రంగానే ధరలు**
**పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**



నిజామాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన పసుపు

**పసుపు**బోర్డు తీసుకొచ్చామని ఘనంగా చెప్పుకుంటున్న బీజేపీ.. రైతుల దుస్థితిపై నోరు మెదపడం లేదు. పసుపుబోర్డుతో ఎలాంటి మేలు కలగట్లేదని రైతాంగం ఘోషిస్తుంటే అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. 9 నెలల పాటు పడిన కష్టమంతా తక్కువ ధరకే వ్యాపారులకు అప్పగిస్తున్న తరుణంలో రైతులు తెల్లముఖం వేయాల్సిన దుస్థితి నెలకొన్నది. పసుపు సాగుతో పాటు ఈసారి దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న అన్నదాతలకు అండగా ఉండాల్సిన సమయంలో అటు ఎంపీ అర్వింద్ కానీ, బీజేపీ కానీ, మరో వైపు పసుపుబోర్డు చైర్మన్ కానీ స్పందించడం లేదు. వాస్తవానికి మార్కెట్‌కు పసుపు రాక తక్కువగా ఉన్నప్పుడు ధర పెరగాలి. కానీ, తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోళ్లు చేయడం వెనుక ఉన్న మతలబు ఎవరికీ అంతు చిక్కడం లేదు.

ప్రస్తుతం పసుపు పంట సాగు చేసే రైతన్నలకు రెండో పంటను వెతుక్కోవడం కత్తిమీది సాములా మారింది. పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతోన్న దిగుబడి, చేతికి అందని గిట్టుబాటు ధరల నేపథ్యంలో పసుపు రైతులకు సైతం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను తెలంగాణ ప్రభుత్వం వర్తింపజేయాలని రైతన్నలంతా కోరుతున్నారు. తద్వార నష్టాల ఊబిలో నుంచి బయట పడేందుకు ఎంతో ఉపయుక్తం అవుతుందని అన్నదాతలు భావిస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బహిరంగంగానే రూ.500 బోనస్‌ను పంటలకు ఇస్తామని చెప్పిన నేపథ్యంలో పసుపు రైతులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు ఈ నిర్ణయాన్ని అమలు చేసి పెద్ద మనసును చాటుకోవాలని కర్షకులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగుకు కష్టాలు ఎదురవుతుండడంతో మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. పెట్టుబడి సాయం కూడా అందకపోవడంతో పసుపు సాగు చేసే రైతన్నలంతా ప్రత్యామ్నాయ పంటల వైపునకు మళ్లుతున్నారు. ఎక్కువ మంది వరి పంట సాగు చేస్తున్నారు.

### మొరం తవ్వకాలకు అనుమతివ్వడం లేదు..

మండలంలో మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడంలేదు. మల్కాపూర్ శివారులో అక్రమంగా మొరం తరలించకుండా కాందార్లను రాత్రివేళ కాపలాగా ఉంచాం. రెవెన్యూతో పాటు మైనింగ్, విజిలెన్స్, పోలీసు శాఖ అధికారులకు కూడా సమాచారమిచ్చి అప్రమత్తం చేశాం. ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

**-అనిరుధ్, తహసీల్దార్, నిజామాబాద్ మండలం**

### తగ్గిన దిగుబడి..

పసుపు పంట సాగు చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పంట కాలం తొమ్మిది నెలలు. ఎరువులు, రసాయనాలు కలిపి ఎకరాకు రూ.లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తున్నారు. తొమ్మిది నెలల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటకు దుంపకుళ్లు సోకింది. భారీగా దిగుబడి వస్తుందనుకున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఎకరాకు సగటున 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుతం 15-20 క్వింటాళ్లకు మించడం లేదని కర్షకులు వాపోతున్నారు. ప్రస్తుత సాగు అంచనాల ప్రకారం సుమారు 10 లక్షల క్వింటాళ్ల వచ్చే అవకాశముంది. కానీ, దుంపకుళ్లు కారణంగా 5-7 లక్షల క్వింటాళ్లే వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. పసుపు రాక తగ్గితే డిమాండ్ పెరిగి ధర పెరగాలి. కానీ, మార్కెట్‌లో రేట్లు అంతగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు పలుకుతున్నది. ఈ ధరల వల్ల రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండడం లేదు. లాభాల సంగతేమో కానీ నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఏటేటా నష్టాలే మిగులుతుండడంతో రైతులు పసుపు సాగు తగ్గిస్తున్నారు. గతంలో జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగయ్యే పసుపు ప్రస్తుత సీజన్‌లో 32 వేలకు పరిమితమైంది.

### రూ.9 వేలు దేనికి సరిపోతది..



తొమ్మిది నెలలు కష్టపడి పసుపు పండిస్తున్నం. పంట తవ్వి, ఉడక బెట్టి, పాలిష్ చేసి మార్కెట్‌కు తెచ్చినం. ఈడికొస్తే ఏమున్నది. క్వింటాల్‌కు రూ.9 వేలు ధర పలుకుతున్నది. ఈ రేట్ల తో మాకు ఏం సరిపోతది. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకపోతే మా పరిస్థితి ఏంది?

**- గోపిడి లింగారెడ్డి, పసుపు రైతు, చౌట్‌పల్లి**

### పసుపుబోర్డుతో లాభమేది..?



పసుపుబోర్డు వచ్చిందంటున్నారు. మరీ ధర ఎందు కు పెరుగుతలేదు. పసుపు బోర్డు వస్తే మా పరిస్థితి మారాలే కదా?. ఇంత తక్కువ ధరకు పంటను అమ్ముకోవడం ఇష్టం లేకున్నా తప్పని పరిస్థితిలో వ్యాపారులకు అప్పగిస్తున్నాం. ఇప్పుడున్న రేట్లతో రైతులకు నష్టాలే మిగులుతాయి. రైతుకు గిట్టుబాటు కావాలంటే కనీస ధర రూ.15 వేలైనా ఉండాలి.

**- ఏలాల జైపాల్, పసుపు రైతు, చౌట్‌పల్లి**

## ఆరోగ్య యోగం

**కామారెడ్డి జిల్లా కేంద్రంలో** భారత స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా శిబిరం కొనసాగుతున్నది. ఆదివారం రాందేవ్ బాబా శిష్యుడు పరమార్థదేవ్ పట్టణవాసులతో యోగాసనాలు వేయించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సర్వ రోగాలు మన దరి చేరకుండా కాపాడుతుందని పేర్కొన్నారు.

– కామారెడ్డి, ఫిబ్రవరి 2





ముసుగేశారు..కానీ..

కామారెడ్డి, ఫిబ్రవరి 2: ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగు వేశారు. కానీ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి ముసుగు వేసినప్పటికీ, తలభాగం కనబడుతున్నది. దీంతో విగ్రహానికి సగం ముసుగు వేయడం ఏంటని, దీనిపై అధికారులు స్పందించి ముసుగు పూర్తిగా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ ముస్కాన్

**జనవరిలో 54 మంది బాలలకు విముక్తి**

- ఆరుగురు యజమానులపై కేసు నమోదు
- ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక తనిఖీలు





బాల కార్మికులను గుర్తించిన అధికారులు (ఫైల్)

కామారెడ్డి, ఫిబ్రవరి 2: జిల్లాలో తప్పిపోయిన చిన్నారులు, వీధి బాలలు, బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, మానవ అక్రమ రవాణాకు గురైన చిన్నారుల జాడ కనిపెట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలనిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తుండగా.. పోలీస్, శిశు, విద్యా, బాల సంరక్షణ శాఖలు భాగస్వాములవుతున్నాయి. ఆపరేషన్ ముస్కాన్-11 కింద బాలలను వెట్టి నుంచి విముక్తి కల్పించడంతోపాటు వారికి అక్షరజ్ఞానం కల్పించేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కింద జనవరిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 54 మంది బాలబాలికలకు విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇతర రాష్ట్రాల బాలలను వారి ప్రాంతాలకు పంపించారు. ఎవరైనా బాలబాలికలను పనిలో పెట్టుకుంటే 100,1098 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. బాల కార్మికులు, భిక్షాటన, వెట్టిచాకిరీ చేస్తున్న చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం, అనాథలను అనాథాశ్రమాలకు పంపించడం, చదువుకు దూరమైన వారిని తిరిగి బడిలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించడం వంటి కార్యక్రమాలను అమలుచేస్తున్నారు.

### 54 మంది బాలబాలికల గుర్తింపు

జిల్లాలో జవనరి 1వ తేదీ నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో 54 మంది బాలబాలికలను గుర్తించారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ల వారీగా ఆయా శాఖల అధికారులతో కలిసి మూడు బృందాలతో తనిఖీలు చేపట్టారు. 54 మంది బాల బాలికలను ఆపరేషన్ ముస్కాన్ ద్వారా గుర్తించగా, ఇందులో 9 మంది బాలికలు, 45 మంది బాలురు ఉన్నారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో గుర్తించిన బాలలను పాఠశాలల్లో చేర్పించడంతోపాటు వారి తల్లిదండ్రుకు అప్పగించారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు బాలకార్మిక చట్టం కింద రెండేండ్ల జైలుశిక్షతోపాటూ జరిమానా విధిస్తున్నారు. బాలకార్మికులను గుర్తిస్తే వారిని బాలల సంరక్షణ సమితికి అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలను సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు.

### ఆరుగురిపై కేసులు నమోదు చేశాం..



జిల్లాలో బాల కార్మికులను పనిలో పెట్టుకున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశాం. 54 మంది బాలబాలికలకు విముక్తి కల్పించాం. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా మూడు డివిజన్లలో తనిఖీలు చేపట్టాం. బాలలతో పనిచేయించడం, పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం. ఎక్కడైనా బాల కార్మికులను దుకాణాలు, హోటళ్లు, పరిశ్రమలు, సంస్థల్లో పెట్టుకుంటే 100 లేదా 1098 నం బర్లకు సమాచారం ఇవ్వాలి. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై చర్యలు తీసుకుంటాం.

**-సింధూశర్మ, కామారెడ్డి ఎస్పీ**